క్లుప్తంగా

తూము మూసివేత

గార్ల: 'వృథాగా పోతున్న పెద్దచెరువు నీరు' అనే శీర్షికన మంగళవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి ఇరిగేషన్ ఏఈ శ్యామ్ స్పందించారు. మండలంలోని పుల్లూరు పెద్దచెరువు తూమును గుర్తుతెలియని వ్యక్తులు తీయడంతో నీరు వృథాగా పోతుంది. స్పందించిన ఏఈ శ్యామ్ పెద్దచెరువు తూమును సందర్శించి లస్కర్‌తో తూమును మూసివేయించారు. ఇంకోసారి ఎవరైనా అనుమతి లేకుండా చెరువు తూము తీస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏఈ హెచ్చరించారు.

సాక్షి ఎఫెక్ట్..

నిరంతర నిఘా ఏర్పాటు



డోర్నకల్: పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో డబ్బు, మద్యం అక్రమ రవాణాపై నిరంతర నిఘా ఏర్పాటు చేశామని తహసీల్దార్ కె.కృష్ణవేణి, సీఐ బి.ఉపేందర్‌రావు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని అమ్మపాలెం క్రాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును మంగళవారం వారు పరిశీలించారు.

నేడు వాహనాల వేలం

గూడూరు: మండల కేంద్రంలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో పలు కేసుల్లో పట్టుబడిన వాహనాల వేలంపాట నేడు నిర్వహించనున్నట్లు సీఐ ఎస్. భిక్షపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టుబడిన వాహనాలలో ఒకలారీ, ఒక వ్యాన్, ఒక తవేర, ఒక టాటా మాక్సిమో, ఒక బొలేరో గూడ్స్ క్యారియర్, ద్విచక్రవాహనాలు ఉన్నాయని తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ఉదయం 10 గంటలకు కార్యాలయం వచ్చి, నిబంధనల ప్రకారం జరిగే వేలంపాటలో పాల్గొనాలని సూచించారు.

మెసెంజర్ల సమస్యలు పరిష్కరించాలి

కేసముద్రం: ఎమ్మార్సీ కార్యాలయాల్లో పనిచేస్తున్న మెసెంజర్ల సమస్యలను పరిష్కరించాలని మంగళవారం హైదరాబాద్‌లో ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డికి మండల కేంద్రానికి చెందిన మెసెంజర్ల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోతు భిక్షపతి వినతిపత్రం అందజేశారు.

నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా సురేష్



కురవి: డోర్నకల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్‌గా చిర్ర సురేష్‌ను రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డి మంగళవారం నియమించారు.

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి

బయ్యారం: లంబాడీలకు అండగా ఉంటున్న కాంగ్రెస్ పార్టీని పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపించాలని సేవాలాల్ సేన మండల అధ్యక్షుడు గుగులోత్ విక్రంనాయక్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. మహబూబాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేస్తున్న బలరాంనాయక్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు మంగీలాల్, శ్రీను, నగేష్, కల్యాణ్, బాలు, తదితరులు పాల్గొన్నారు.

బెల్లయ్యనాయక్‌కు అభినందనలు



మహబూబాబాద్ రూరల్: రాష్ట్ర గిరిజన ఆర్థిక సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నియామకమైన డాక్టర్ తేజావత్ బెల్లయ్యనాయక్‌ను కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పార్లమెంటరీ నియోజకవర్గ ఆదివాసీ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ గుగులోతు వెంకట్ నాయక్, పట్టణ ఓబీసీ అధ్యక్షుడు లింగాల వీరభద్రం గౌడ్, పట్టణ ఎస్టీ సెల్ అధ్యక్షుడు తేజావత్ శంకర్‌నాయక్, మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు ధరావత్ నారాయణనాయక్, గుగులోత్ నరేష్ నాయక్ పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా సీసీ రోడ్ల నిర్మాణాలు

నెల్లికుదురు: సీసీరోడ్ల నిర్మాణంలో నిబంధనలు గాలికి వదిలేసి కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఇనుగుర్తి మండలంలోని మీశ్యతండా, చిన్ననాగారంలో సీసీ రోడ్డు నిర్మాణంలో 7ఇంచుల ఎత్తు, 12ఫీట్ల వెడల్పు కొలతలు చేపట్టాల్సి ఉండగా ఎత్తు కనీసం 4ఇంచులు కూడా ఉండడం లేదు. సీసీ రోడ్ల నిర్మాణ పనులను అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

'2జీ'తో తప్పనితిప్పలు

● సర్వేతో అంగన్‌వాడీ టీచర్లు సతమతం

చిన్నగూడూరు: జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ టీచర్లు ఇంటింటికీ తిరిగి సర్వే చేపడుతున్నారు. సర్వేలో భాగంగా ప్రతి సంవత్సరం సెంటర్ పరిధిలో అంగన్‌వాడీ టీచర్స్ ప్రతి ఇంటిలో ఎంత మంది ఉన్నారు.. వారి ఆధార్ కార్డ్, ఫోన్‌నంబర్ వంటి వివరాలు నమోదు చేయాలి. అయితే వీరు 2జీ ఫోన్‌లో యాప్‌తో వివరాలు నమోదు చేస్తున్నారు. ప్రస్తుత కాలంలో 4జీ, 5జీ నెట్‌వర్క్ నడుస్తుంటే అంగన్‌వాడీ టీచర్లకు మాత్రం 2జీ నెట్‌వర్క్‌తో సర్వే చేస్తుండడంతో ఒక డేటా ఎంట్రీ చేయడానికి 15 నిమిషాల సమయం పడుతోంది. దీంతో ఆలస్యమై ఇబ్బందులు పడుతున్నట్లు అంగన్‌వాడీలు తెలుపుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా 1,437 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా 1,355 మంది టీచర్లు సర్వే చేస్తున్నారు. ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో 1,118 ఆయాలు పని చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు అందుబాటులో ఉండకపోవడంతో ఆయాలను ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరిస్తున్నారు. సెంటర్‌లో ఒక్కరే ఉండడంతో పనిభారం ఎక్కువ అవుతుందని పలువురు ఆయాలు తెలుపుతున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 8లక్షల జనాభా ఉండడంతో వారి వివరాలు పొందుపర్చడంలో అంగన్‌వాడీ టీచర్లకు సవాలుగా మారింది,

సర్వేతో అంగన్‌వాడీ టీచర్లు అందుబాటులో లేకపోవడంతో బాలింతలు, గర్భిణులు, పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. అంగన్‌వాడీ సెంటర్లను ఆయాలకు అప్పజెప్పడంతో వారికి పనిభారం ఎక్కువై పిల్లలను సరిగా చూసుకోరని పిల్లల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



సర్వే చేస్తున్న అంగన్‌వాడీ టీచర్

ఆలస్యమవుతోంది



ప్రస్తుత కాలంలో 4జీ, 5జీ నెట్‌వర్క్ నడుస్తుంటే.. అంగన్‌వాడీ టీచర్లు మాత్రం 2జీ నెట్‌వర్క్‌తో సర్వే చేస్తుండడంతో ఒక డేటా ఎంట్రీ చేయడానికి 15 నిమిషాల సమయం పడుతోంది. దీంతో ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వం స్పందించి స్మార్ట్ ఫోన్, ట్యాబ్స్ ఇస్తే ఎంట్రీ సులభతరం అవుతుంది. - స్నేహబిందు, అంగన్‌వాడీ సంఘం జిల్లా కార్యదర్శి

పీడీఎస్ బియ్యం పట్టివేత

గూడూరు: ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 45క్వింటాళ్ల రేషన్ బియ్యం బస్తాలను పట్టుకున్నట్లు ఎస్సై సీహెచ్.నగేష్ తెలిపారు. వివరాల ప్రకారం మండలంలోని గుండెంగ నుంచి భువనగిరి జిల్లా తుర్కపల్లికి చెందిన గుగులోతు బాలు అనే వ్యక్తి 45 క్వింటాల పీడీఎస్ బియ్యం బస్తాలను ట్రాలీ ఆటోలో తరలిస్తున్నట్లు మంగళవారం విశ్వసనీయ సమాచారం వచ్చిందన్నారు. వెంటనే గుండెంగ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించగా ట్రాలీలో వెళ్తున్న బస్తాలు రేషన్ బియ్యంగా గుర్తించి స్టేషన్‌కు తరలించామన్నారు. వ్యాపారి బాలుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

దాట్లలో 6క్వింటాళ్లు..

దంతాలపల్లి: మండలంలోని దాట్ల గ్రామంలో సోదాలు నిర్వహిస్తున్న క్రమంలో గ్రామానికి చెందిన సంపెట శ్రీను పీడీఎస్ బియ్యం ప్రజల నుంచి కొనుగోలు చేసి ఆటోలో అక్రమంగా తరలిస్తున్నాడు. అతని వద్ద నుంచి 6క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకొని ఆటో సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై కరుణాకర్ మంగళవారం తెలిపారు.



గూడూరు: పట్టుకున్న పీడీఎస్ బియ్యం చూపిస్తున్న పోలీసులు

కోతుల దాడిలో పలువురికి గాయాలు

తొర్రూరు: కోతుల దాడిలో పలువురికి గాయాలైన సంఘటన మంగళవారం డివిజన్ కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని సాయినగర్, రాజీవ్‌నగర్ కాలనీలకు చెందిన పలువురు పనుల నిమిత్తం బయటికి వెళ్తున్న క్రమంలో కోతులు వారి మీదకి దూకి గాయపర్చాయి. తల, చేతులు, శరీర భాగాలపై విచక్షణా రహితంగా కరవడంతో దాదాపు ఏడుగురు గాయపడ్డారు. క్షతగాత్రులు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందారు. దీంతో పాటు మండలంలోని చింతలపల్లి గ్రామంలో ఓ వ్యక్తిపై కొండెంగ దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు.



కోతుల దాడిలో గాయపడిన స్థానికులు

'పేదల కోసం పోరాడేది కమ్యూనిస్టులే'

దంతాలపల్లి: పేదల హక్కుల కోసం పోరాడేది కమ్యూనిస్టులే అని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యంతో పేదలకు ఇంటి స్థలాలు, ఇళ్లు దక్కలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలతో నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. మత విద్వేష రాజకీయాలతో పాలన సాగిస్తున్న మోదీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తురుక రమేష్, సారయ్య, మురళి, సోమారపు వెంకటయ్య, జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

గుడుంబా స్వాధీనం

డోర్నకల్: మండలంలోని రాముకుంటతండా సమీపంలో అక్రమంగా తరలిస్తున్న నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సంతోష్‌రావు మంగళవారం తెలిపారు. రామకుంటతండాకు చెందిన బానోత్ భారతి నాటుసారాను అక్రమంగా తరలిస్తుండగా ఉప్పలయ్య మామిడితోట సమీపంలో పట్టుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నాడు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి



మాట్లాడుతున్న శిరీష

మరిపెడ రూరల్: మానవ అక్రమ రవాణాను అరికట్టాలని ఎఫ్ఎంఎం సోషల్ సర్వీస్ సొసైటీ మండల కోఆర్డినేటర్ నిరుడు శిరీష అన్నారు. మంగళవారం మండలంలోని తానంచర్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో మానవ అక్రమ రవాణా, బాల్యవివాహాలపై సొసైటీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. ఈసందర్భంగా శిరీష మాట్లాడుతూ.. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. అపరిచిత వ్యక్తుల ప్రవర్తనపై ఏ మాత్రం అనుమానం వచ్చిన టోల్‌ఫ్రీ నంబర్ 100, 1098, 1930 సమాచారం అందించాలన్నారు. ఈ సదస్సులో జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం అనితాదేవి, కార్యదర్శి మౌనిక, అనితారాణి, మంగమ్మ, యమున, మహిళలు పాల్గొన్నారు.

అధిక మెజార్టీతో గెలిపించాలి



మాట్లాడుతున్న సీతారాం నాయక్

నెల్లికుదురు: మహబూబాబాద్ నియోజకవర్గ ప్రజలందరూ సహకరించి ఎంపీగా అధిక మెజార్టీతో గెలిపించాలని బీజేపీ ఎంపీ అభ్యర్థి అజ్మీరా సీతారాంనాయక్ కోరారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. ఎన్నికల సర్వేలో 73శాతం గెలుపు తనకే అనుకూలంగా ఉందన్నారు. కార్యకర్తలు, నాయకులు ప్రతీ ఒక్కరు ప్రధాని మోదీ చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లి తన గెలుపునకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, పాపరావు, చందు రాజు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'పది' పరీక్షలు

చిన్నగూడూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం పదో తరగతి పరీక్ష ప్రశాంతంగా కొనసాగినట్లు ఎంఈఓ పూల్‌చంద్ తెలిపారు. రెండో రోజు హిందీ పేపర్‌కు 189 మంది విద్యార్థులకు 188 మంది హాజరు కాగా ఒకరు గైర్హాజరైనట్లు తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద సిబ్బంది విద్యార్థులను తనిఖీ చేసిన తర్వాతే లోపలికి అనుమతించినట్లు పేర్కొన్నారు. పరీక్ష సెంటర్ వద్ద పోలీసులు 144వ సెక్షన్ అమలు చేశారని తెలిపారు.

డోర్నకల్: డోర్నకల్‌లోని మూడు పరీక్ష కేంద్రాల్లో రెండో రోజు పది పరీక్షలు కొనసాగాయి. పోలీసులు, ప్రత్యేక స్క్వాడ్ బృందం విస్తృత తనిఖీలు నిర్వహించారు.



చిన్నగూడూరు: విద్యార్థులను తనిఖీ చేస్తున్న అధికారులు

50 ట్రాక్టర్ల ఇసుక మాయం..!



రావిరాల గ్రామంలో మాయమైన ఇసుక నిల్వలు

నెల్లికుదురు: డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం కోసం నిల్వ చేసిన సుమారు 50ట్రాక్టర్ల ఇసుక మాయమై మూడు రోజులైనా అధికారులకు పట్టింపు లేదు. ఈ సంఘటన మండలంలోని రావిరాల గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే రావిరాల గ్రామంలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం 2021లో 25 డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేసింది. ఇళ్ల నిర్మాణం కోసం అప్పటి కాంట్రాక్టర్ ప్రభుత్వ అనుమతులతో గ్రామస్తుల ట్రాక్టర్లతో సుమారు 50ట్రాక్టర్ల ఇసుకను నిల్వ చేశాడు. కొంతకాలానికి డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోయాయి. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం ఇసుక మాయమైందని గ్రామస్తులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ రావిరాల ప్రత్యేక అధికారి రాజును వివరణ కోరగా గ్రామంలో పంచాయతీ కార్యదర్శి బాధ్యత తీసుకోవాలన్నారు. ఇసుక మాయంపై విచారణ చేపట్టి, ఉన్నతాధికారుల ఆదేశాలతో ఇసుక మాయం చేసిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

గౌడ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

గార్ల: రాష్ట్రంలో అన్నికులాలకు ఏర్పాటు చేసిన విధంగా గౌడ కులస్తుల అభ్యున్నతి కోసం గౌడ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తోడేటి శ్రీనివాస్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం గార్లలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి గౌడ కులస్తులు ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. గౌడ కార్పొరేషన్ ఏర్పాటు చేయకుండా గౌడలను చిన్నచూపు చూసిందని ఆవేదన వ్యక్తం చేశారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

పెద్దవంగర: చిన్నారులు ఆరోగ్యంగా ఎదగాలని ఐసీడీఎస్ సీడీపీఓ హైమావతి అన్నారు. మంగళవారం మండలంలోని వడ్డెకొత్తపల్లి గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. స్థానికంగా లభించే తృణధాన్యాలు, కూరగాయలు, పండ్లు వినియోగంపై ప్రాముఖ్యమైన ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులకు కిశోర బాలికలకు సూపర్‌వైజర్ కవిత అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పల్లెదవాఖాన వైద్యులు రాజ్‌కుమార్, జీపీ కార్యదర్శి మురళీ, పోషణ్ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ అశోక్, ఏఎన్ఎం బూబా, అంగన్‌వాడీ టీచర్లు సుకన్య, అరుణ, మంజుల, రేణుక, స్వరూప, సరళ, నీలావేణి పాల్గొన్నారు.

చిన్నగూడూరు: మండలంలోని ఉగ్గంపల్లి జీపీ పరిధిలోని ఆయా అంగన్‌వాడీ కేంద్రాల టీచర్స్ ఆధ్వర్యంలో ఘనంగా పోషణ్ పక్వాడా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కవిత హాజరై గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పోషణ్ పక్వాడాపై అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు నాణ్యమైన పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ శివమ్మ, కళావతి, పద్మ, లలిత, జ్యోతి, విజయ పాల్గొన్నారు.

మరిపెడ రూరల్: అంగన్‌వాడీలో అందే పోషకాహారంతోనే సంపూర్ణమైన ఆరోగ్యం కలుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాణి, శ్రీలత అన్నారు. వీరారం, నీలికుర్తి గ్రామ పంచాయతీ పరిధిలోని మూన్యతండా అంగన్‌వాడీ కేంద్రాలలో పోషణపక్షం, అన్నప్రాసన కార్యక్రమాలను మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ల, శిరీష్, కనకమ్మ, కవిత పాల్గొన్నారు.



చిన్నగూడూరు: అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ కవిత



పెద్దవంగర: చిరుధాన్యాలతో ప్రదర్శన..



మరిపెడ రూరల్: మూన్యతండా అంగన్‌వాడీ కేంద్రంలో..

సంక్షిప్త సమాచారం

లంపీ వైరస్‌తో పశువు మృతి

దంతాలపల్లి: లంపీ వైరస్ (ముద్దచర్మ వ్యాధి) సోకిన పశువు మంగళవారం చనిపోయింది. దంతాలపల్లి మండలం రామానుజపురం గ్రామంలో కలకుంట అంజయ్యకు చెందిన పశువుకు లంపీ వైరస్ సోకింది. దీనిపై పత్రికల్లో వార్తలు రావడంతో మండల పశువైద్యాధికారి వచ్చి ఒకరోజు వైద్యం చేసి వెళ్లారు. అయినా వ్యాధి తగ్గకపోవడంతో ఆరోగ్యం క్షీణించి చనిపోయిందని యజమాని అంజయ్య తెలిపాడు. సరైన వైద్యం అందకనే చనిపోయిందని వాపోయాడు.

ఎండుతున్న వరి పొలాలు

డోర్నకల్: ఎండ తీవ్రత పెరుగుతుండడంతో మండలంలోని పలు ప్రాంతాల్లో వరి పొలాలు ఎండుతున్నాయి. కస్నాతండా, పాతదుబ్బతండా, కొత్తదుబ్బతండా తదితర ప్రాంతాల్లో వ్యవసాయ బావుల్లో నీటి నిల్వలు అడుగంటడంతో వరి పొలాలు ఎండుతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

టై, బెల్ట్‌ల పంపిణీ

దంతాలపల్లి: మండలంలోని కుమ్మరికుంట్ల జిల్లా పరిషత్ పాఠశాలలో వాసవి క్లబ్ తొర్రూరు సరస్వతి వారి ఆధ్వర్యంలో పాఠశాలలో గణితశాస్త్రం బోధించే ఉపాధ్యాయుడు తమ్మి రమేష్ వివాహ రోజు పురస్కరించుకొని మంగళవారం విద్యార్థులకు రూ.7వేల విలువ చేసే టై, బెల్టులు, ఐడీ కార్డుల పంపిణీ చేశాడు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు సోమయ్య, క్లబ్ కార్యదర్శి శ్రీనువాస్, నవీన్ కుమార్, ఉపాధ్యాయులు వెంకన్న, జాఫార్‌అలీ, శోభరాణి పాల్గొన్నారు.

టీకాలు వేయించాలి

దంతాలపల్లి: రైతులు పశువులకు గాలికుంటూ వ్యాధి నివారణ టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి వినోద్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఈ వ్యాధి సోకిన జీవాల నాలుకపై పుండ్లు ఏర్పడి, మేత మేయలేక చనిపోతాయన్నారు. వచ్చే నెల 15వరకు టీకాలు వేస్తామన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలోని హౌజింగ్ బోర్డు కాలనీలోని యాళ్ల సత్తిరెడ్డి స్మారక కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం కాలనీ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జి.బాలునాయక్, ప్రధాన కార్యదర్శిగా నర్సిరెడ్డి, కోశాధికారిగా లింగయ్య, ఉపాధ్యక్షులుగా బుచ్చిరెడ్డి, వీరస్వామి, ప్రచార కార్యదర్శిగా శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా వీరునాయక్, శ్రీనివాస్, అనిల్‌కుమార్‌ను ఎన్నుకున్నారు.

పరీక్ష ఫీజు గడువు పెంపు

దంతాలపల్లి: తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం నిర్వహించనున్న ఓపెన్ పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్ష ఫీజులు చెల్లించడానికి ఈనెల 21 వరకు గడువు పొడిగించినట్లు ఓపెన్ పాఠశాల కోఆర్డినేటర్ వేణుమాధవరెడ్డి మంగళవారం తెలిపారు.

కేసు నమోదు

గార్ల: మండలంలోని అంజనాపురం గ్రామానికి చెందిన బి.సాలి అక్రమంగా గుడుండా విక్రయిస్తుండగా ఇంట్లో నిల్వ ఉన్న 100 లీటర్ల బెల్లంపానకం, 6లీటర్ల కాపుసారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై జీవత్‌కుమార్ తెలిపాడు.

ఆర్థికసాయం

దంతాలపల్లి: మండలంలోని పెద్దముప్పారం గ్రామానికి చెందిన నిరుపేద అయిన పోలోజ్ నవీన్ అనారోగ్య కారణాలతో ఖమ్మంలోని ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న నవీన్ బాల్యమిత్రులు రూ.70వేల ఆర్థికసాయం మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో మిత్రులు గౌడిశాల సంజీవరావు, చెల్లమల్ల రాజేందర్, ఈగ మహేష్, యన్నం వెంకట్, చెన్న వెంకట్, కాశమల్ల రాంబాబు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

కురవి: మండలంలోని కురవి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య, కురవి ఎస్సై బి.గోపి మంగళవారం పరిశీలించారు. ఎన్నికల నియమాలను ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ట్రాక్టర్ నడుపుతున్న మైనర్



నెల్లికుదురు: ఓ మైనర్ ట్రాక్టర్ వాటర్ ట్యాంకర్ నడుపుతూ.. సీసీ రోడ్ల నిర్మాణ పనుల్లో వాటర్ పోస్తూ మంగళవారం కనిపించాడు. ఇనుగుర్తి మండలం చిన్ననాగారం గ్రామంలో బాలుడు వాటర్ ట్యాంకర్ ట్రాక్టర్ నడుపుతూ సీసీ రోడ్లకు వాటర్ క్యూరింగ్ చేస్తున్నాడు. బాలుడితో పనులు చేయించడమే చట్టవిరుద్ధం.. అలాంటిది ట్రాక్టర్‌ను బాలుడి చేతికి ఇచ్చి కాంట్రాక్టర్ చోద్యం చేస్తున్నాడని స్థానికులు తెలిపారు.


ఇసుక ట్రాక్టర్ల సీజ్

మహబూబాబాద్ రూరల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మండలంలోని జంగిలిగొండ క్రాస్ రోడ్డు వద్ద పట్టుకుని సీజ్ చేశామని రూరల్ ఎస్సై వి.దీపికరెడ్డి మంగళవారం తెలిపారు. ట్రాక్టర్ యజమాని గుగులోత్ సుమన్, డ్రైవర్ ఆంగోత్ రవిపై కేసు నమోదు చేశామన్నారు.

శుభ్రమైన నీటిని సరఫరా చేయాలి

మహబూబాబాద్: జిల్లా కేంద్రం శివారులోని మంగళికాలనీకి శుభ్రమైన నీరు సరఫరా చేయాలని కాలనీ మహిళలు రేష్మ, సుజాత, కవిత, అశ్విని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీ సమీపంలో ఉన్న బావి వద్ద మంగళవారం ఆందోళన చేశారు. బావి ప్రక్కనే శ్మశానవాటిక ఉందన్నారు. కొందరు ఆ నీటిలో నిమ్మ కాయలు, కొబ్బరికాయలు, చెత్త వేయడంతో బావిలో నీరు అపరిశుభ్రంగా మరాయన్నారు. దీంతో అనారోగ్యానికి గురవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి శుభ్రమైన నీటిని సరఫరా చేయాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు.

మాజీ సర్పంచ్‌పై ఫిర్యాదు



చిన్నగూడూరు: చిన్నగూడూరు మాజీ సర్పంచ్‌పై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎంపీఓ యాకయ్య ఫిర్యాదు చేశాడు. ఎంపీఓ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గతంలో సర్పంచ్‌గా పనిచేసిన కంచనపల్లి వీరమ్మ గ్రామ పంచాయతీకి సంబంధించిన పూర్తిస్థాయి చార్జ్‌తోపాటు 5హెచ్‌పీ మోటార్‌ను పదవీకాలం ముగియగానే జీపీకి అప్పగించారన్నారు. కానీ అట్టి మోటార్ ప్రస్తుతం కనిపించటం లేదని తెలిపారు. ఇటీవల చిన్నగూడూరు గ్రామ సర్పంచ్‌గా పదవీకాలం పూర్తి చేసుకున్న కొమ్ము మల్లయ్య గ్రామ పంచాయతీ చార్జ్ అప్పగించుటలో జాప్యం చేసినట్లు పేర్కొన్నారు. మాజీ సర్పంచ్ వద్ద ఉన్న 5హెచ్‌పీ మోటార్‌ను అప్పగించకుండా కాలయాపన చేస్తున్నాడని ఆయనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.